సాక్షి
అనకాపల్లి
సోమవారం । 27 । జనవరి । 2025



గౌరవ వందనం స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ విజయక్రిష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా




స్టాళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయక్రిష్ణన్, జేసీ జాహ్నవి, ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

గణతంత్ర దీపిక.. ప్రగతి పతాక



మాట్లాడుతున్న కలెక్టర్ విజయక్రిష్ణన్

- పారిశ్రామిక జిల్లాగా అనకాపల్లి అభివృద్ధి
- మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దుతాం
- జిల్లా కలెక్టర్ విజయక్రిష్ణన్
- జాతీయ పతాకావిష్కరణ
- ఘనంగా 76వ గణతంత్ర వేడుకలు



భరతమాత వేషధారణలో విద్యార్థిని

సాక్షి, అనకాపల్లి: ప్రగతి బాటలో అనకాపల్లి జిల్లాను నిలపడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అన్నారు. మాదకద్రవ్య రహితంగా అనకాపల్లి జిల్లాను తీర్చిదిద్దడమే ధ్యేయమని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ఆదివారం అనకాపల్లి టౌన్‌లో గల ఎన్టీఆర్ క్రీడా మైదానంలో 76 వ గణతంత్ర దిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ జాతీయ పతాకాన్ని ఎగురవేసి వందనం సమర్పించారు. అనంతరం జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హాతో కలిసి ఆమె పోలీసు పరేడ్‌ను పరిశీలించారు. పరేడ్ కమాండర్ మన్మథరావు సారథ్యంలో పోలీసు దళాలు కవాతు నిర్వహించి గౌరవ వందనం సమర్పించారు. కార్యక్రమంలో ముందుగా డాగ్ స్క్వాడ్ ముఖ్య అతిథి కలెక్టర్ విజయక్రిష్ణన్‌కు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికింది. అత్యున్నత ప్రతిభ, అద్భుత విన్యాసాలను ప్రదర్శించిన డాగ్ స్క్వాడ్ ప్రత్యేక బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రసంగిస్తూ జిల్లా ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.



డాగ్ స్క్వాడ్ విన్యాసాలు



నీటితో మూడు రంగుల విన్యాసం

అభివృద్ధికి బాటలు వేస్తాం...

జిల్లాలో అభివృద్ధి, ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల ప్రగతి గూర్చి తెలియజేశారు. వీటిలో ప్రధానంగా పూడిమడకలో రూ.1.8 లక్షల కోట్లతో 1200 ఎకరాల భూమిలో ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టును, నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్క్‌ను, మిట్టల్ నిప్పన్ స్టీల్ కంపెనీ, రాంబిల్లిలో రూ.500 కోట్లతో 100 ఎకరాల్లో బాలాజీ యాక్షన్ బిల్డ్ వెల్ కంపెనీని ఏర్పాటు చేస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. పల్లె పండగలో పీఆర్ విభాగంలో బీటీ, సీసీ, డబ్ల్యూబీఎం రోడ్లు పురోగతిలో ఉన్నాయని, ఆర్అండ్‌బీ, ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో పాట్ హోల్ ఫ్రీ రహదారులు పథకం కింద గుంతలు పూడుస్తున్నామన్నారు. పోలీస్ శాఖ అధ్వర్యంలో డ్రోన్ టెక్నాలజీతో స్టాటిక్, డైనమిక్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి గంజాయి అక్రమ రవాణా అరికడుతున్నామన్నారు. మొబైల్ ప్రచార వాహనం ద్వారా మహిళలు, బాలబాలికలకు చట్టాల పట్ల అవగాహన కల్పించేందుకు పాఠశాలలు, కళాశాలల్లో వీడియోలు ప్రదర్శించి వారి భద్రతకు భరోసా కల్పిస్తున్నామని పేర్కొన్నారు. సైబర్ క్రైం అవగాహన కార్యక్రమాలను పెంచుతున్నామని తెలిపారు. వివిధ శాఖల వారీగా సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించారు.

ఉత్తమ ప్రతిభకు ప్రశంసాపత్రాలు

జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, జేసీ జాహ్నవి, ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ చేతుల మీదుగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, రెవిన్యూ, ఇతర శాఖల సిబ్బందికి జిల్లా కలెక్టరు ప్రశంసా పత్రాలు అందజేశారు. చివరగా వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషను స్టాల్స్ జిల్లా కలెక్టరు సందర్శించారు. సర్వశిక్షా అభియాన్ స్టాల్‌లో విద్యార్థులు ప్రదర్శించిన నూతన ఆవిష్కరణల నమూనాల వివరాలను తెలుసుకొని ప్రశంసించారు.2024 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో జిల్లాలో ఉత్తమ మార్కులు సాధించిన పాయకరావుపేట జిల్లాపరిషత్ బాలికల హైస్కూలు విద్యార్థిని కోటిపల్లి సత్య ధనస్వాతి (592 మార్కులు), పాయకరావుపేట మండలం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని గట్టం శ్రీలేఖ (591 మార్కులు), పాయకరావుపేట జిల్లా పరిషత్ బాలికల హైస్కూలు విద్యార్థిని జాన లలితా భవాని (588 మార్కులు), పరవాడ మండలం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి దూడ రఘు (588మార్కులు), అనకాపల్లి జీవీఎంసీ హైస్కూలు విద్యార్థిని కరణం సంజన (588 మార్కులు)లను అభినందిస్తూ జ్ఞాపికలు, పశంసాపత్రాలు అందజేశారు. జాతీయ సైన్స్ ఫేర్‌కు ఎంపికైన నక్కపల్లి జిల్లాపరిషత్ బాలుర హైస్కూలు విద్యార్థి కె.జయవర్దన్, విద్యార్థికి గైడ్‌గా వ్యవహరించిన ఉపాధ్యాయిని జి. సుమబిందు, జిల్లా కోఆర్డినేటరు పి. రాజారావులను సన్మానించారు.

కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, జేసీఎం.జాహ్నవి, ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీ తేజ్, డీఆర్‌వో వై.సత్యనారాయణరావు, ఆర్‌డీఓ షేక్ ఆయిషా, వి.వి రమణ, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ సురేంద్ర, సీపీవో రామారావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



జెండా వందనం చేస్తున్న కలెక్టర్ విజయకృషన్



ఎస్పీ తుహిన్ సిన్హాతో ప్రశంసాపత్రాలు అందుకున్న పోలీసు అధికారులు, సిబ్బంది

ఎస్పీ కార్యాలయంలో గణతంత్ర వేడుకలు



జాతీయ జెండాను ఆవిష్కరించిన ఎస్పీ తుహిన్ సిన్హా, విశాఖ కోర్టు న్యాయమూర్తి నిఖిత సిన్హా

అనకాపల్లి : స్థానిక ఎస్పీ కార్యాలయంలో 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్పీ తుహిన్ సిన్హా, ఎస్పీ సతీమణి విశాఖ జూనియర్ సివిల్ న్యాయమూర్తి నిఖిత సిన్హాలు జాతీయ జెండాను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్వాతంత్య్రం పొందిన అనంతరం దేశంలో పరిపాలన కొరకు అత్యంత అవశ్యకత కలిగిన తన సొంత రాజ్యాంగం అమలు చేయాలని రాజ్యాంగ ముసాయిదా కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాజ్యాంగ ముసాయిదా కమిటీ రూపొందించిన భారత రాజ్యాంగం 1950 జనవరి 26న అమల్లోకి వచ్చిందన్నారు. అప్పటి నుంచి దేశం ప్రజాతంత్ర పరిపాలన కలిగిన సంపూర్ణ గణతంత్ర రాజ్యంగా ఆవిర్భవించిందని చెప్పారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ(పరిపాలన) ఎం.దేవప్రసాద్, అదనపు క్రైం ఎస్పీ ఎల్.మోహన్‌రావు, డీఎస్పీలు బి.అప్పారావు, ఎం.శ్రావణి, పొతిరెడ్డి శ్రీనివాసరావు, వి.విష్ణుస్వరూప్, ఈ.శ్రీనివాసరావు, మోహన్‌రావు, పి.నాగేశ్వరరావు, ఏవో ఎ.రామకుమార్, సీఐలు లక్ష్మణమూర్తి, టి.లక్ష్మి, టి.వి.విజయకుమార్. ఎం.వెంకటనారాయణ, బాల సూర్యారావు, రామకృష్ణారావు, మన్మథరావు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ అనుబంధ శకటానికి మొదటి బహుమతి

కార్యక్రమంలో పోలీసు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, ఏపీఐబీసీ, వైద్య ఆరోగ్యశాఖ, ప్రాథమిక రంగాలైన వ్యవసాయ, మత్స్య, పశుసంవర్ధకశాఖ, రోడ్లు భవనాలు శాఖ, ఏపీఈపీడీసీఎల్, గిరిజన సంక్షేమశాఖ, రవాణాశాఖ, ఎక్సైజ్ శాఖ, పౌరసరఫరాల శాఖ, విపత్తుల నిర్వహణశాఖల వారీగా అమలు చేస్తున్న పథకాలను తెలియజేస్తూ శకటాలను ప్రదర్శించారు. వీటిలో ప్రాథమిక వ్యవసాయాధారిత రంగాలైన వ్యవసాయ, మత్స్య, పశు సంవర్ధక శాఖ శకటానికి మొదటి బహుమతి, గిరిజన సంక్షేమ శాఖ శకటానికి రెండో బహుమతి, ఏపీఈపీడీసీఎల్ శకటానికి మూడో బహుమతి లభించాయి. కన్సొలేషన్ బహుమతుల్లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ శకటానికి మొదటి బహుమతి, ఏపీఐబీసీ శకటానికి రెండో బహుమతి, రవాణాశాఖ శకటానికి మూడో బహుమతి అందజేశారు. విపత్తుల నిర్వహణ శాఖ ప్రదర్శన ప్రజలను ఆకట్టుకొంది. ప్రమాదాలు జరిగినపుడు ఎదుర్కొనే విధానంపై ప్రదర్శన నిర్వహించారు. విద్యుత్ శాఖ, భూగర్భ, గనులు శాఖ, జిల్లా క్రీడా సాధికార సంస్థ, మెప్మా, పరిశ్రమలశాఖ, గ్రామీణ నీటి సరఫరా శాఖ, జిల్లా గ్రామ పంచాయతీ శాఖ, గృహనిర్మాణ సంస్థ, వైద్య ఆరోగ్యశాఖ, సర్వే, భూమి రికార్డులు శాఖ, పాఠశాల విద్యాశాఖలు, ప్రభుత్వ పథకాలను తెలియజేస్తూ ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ స్టాల్స్ విశేషంగా ఆకట్టుకొని, ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.










పరేడ్‌లో పాల్గొన్న వివిధ ప్రభుత్వ శాఖల శకటాలు

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

సాంస్కృతిక ప్రదర్శనలలో భాగంగా తానాంకు చెందిన ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్ పాఠశాల విద్యార్థినులు ప్రదర్శించిన 'సమరభావన' నృత్యం, అగనంపూడి లేమర్తి ఏబీఎస్ హైస్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన 'ఇదే మన భారతం', కొక్కిరాపల్లికి చెందిన డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ గురుకులం విద్యార్థినులు ప్రదర్శించిన 'వందేభారతం' నృత్యం, దేవరాపల్లి కేజీబీవీ విద్యార్థులు ప్రదర్శించిన 'మా తుఝే సలాం' నృత్యం, అనకాపల్లికి చెందిన డీఏవీ పబ్లిక్ స్కూలు వారు ప్రదర్శించిన 'మన దేశం' నృత్యం, తాటిపూడికి చెందిన గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, వి.మాడుగుల విద్యార్థినులు ప్రదర్శించిన 'థింసా నృత్యం' అలరించాయి. ఈ సంవత్సరం సాంస్కృతిక ప్రదర్శనల్లో పాల్గొన్న విద్యార్థులు అందరూ విజేతలేనంటూ అందరికీ ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. నర్సీపట్నం మండలం గురందొరపాలెం గ్రామానికి చెందిన శ్రీ అభయాంజనేయ స్వామి బృందం కోలాటం ప్రదర్శించారు.






గణతంత్ర వేడుకల్లో అలరించిన విద్యార్థుల విన్యాసాలు, సాహసకృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు

- వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఘనంగా గణతంత్ర దినోత్సవం
- జాతీయ జెండాను ఆవిష్కరించిన మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం : ప్రస్తుతం మన రాష్ట్రంలో అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం కాకుండా.. రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతుందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. విదేశాల్లో కూడా రెడ్ బుక్ రాజ్యాంగం గురించి చంద్రబాబు, ఆయన తనయుడు చెప్పుకుంటూ ఏపీ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. ఆదివారం మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర మత్స్యకార విభాగం అధ్యక్షుడు పేర్ల విజయ్ చందర్ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా మాజీ మంత్రి అమర్‌నాథ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల హక్కులను వైఎస్సార్ సీపీ కాపాడుతుందని పేర్కొన్నారు. రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు తీసుకొస్తామని దావోస్‌కు వెళ్లిన సీఎం చంద్రబాబు పెట్టుబడులు రాకపోయేసరికి మాట మార్చారని విమర్శించారు. దావోస్ పర్యటన ఒక మిథ్య అంటూ మాట్లాడుతున్నారని, పదిసార్లు దావోస్ వెళ్లి వచ్చిన తరువాత ఆ విషయం తెలిసిందా..? అని ప్రశ్నించారు. మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా.. విజయసాయిరెడ్డి వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నానని స్వయంగా చెప్పారని తెలిపారు. తనలాంటి వారిని వెయ్యి మందిని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తయారు చేయగలరని విజయసాయిరెడ్డి పేర్కొన్నారని వివరించారు. అయినప్పటికీ విజయసాయిరెడ్డి పార్టీకి రాజీనామా చేయడం లోటుగానే భావిస్తామన్నారు. గతంలో నలుగురు టీడీపీ రాజ్యసభ సభ్యులు చంద్రబాబు మీద నమ్మకం లేకనే ఆ పార్టీని వీడిపోయారా..? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అన్నంరెడ్డి అదీప్‌రాజ్, చింతలపూడి వెంకటరామయ్య, జిల్లా పార్టీ కార్యాలయ పర్యవేక్షకుడు రవిరెడ్డి, కార్పొరేటర్ బిపిన్ కుమార్ జైన్, పార్టీ ముఖ్య నాయకులు రొంగలి జగన్నాథం, మొల్లి అప్పారావు, ద్రోణంరాజు శ్రీ వాత్సవ్, పేడాడ రమణకుమారి, నడింపల్లి కృష్ణంరాజు, డా. జహీర్ అహ్మద్, అల్లంపల్లి రాజాబాబు, పార్టీ నాయుకులు రామన్న పాత్రుడు, మారుతి ప్రసాద్, బి.పద్మావతి, కె.వి.బాబా, సేనాపతి అప్పారావు, కాళిదాసు రెడ్డి, లక్ష్మి, రాము, అప్పన్న, పి.ప్రేమ, లావణ్య, పల్ల దుర్గ, అప్పలనాయుడు, మరియా దాస్, గణేష్, జగుపల్లి నరేష్, మళ్ల శ్రీదేవి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ జెండా ఎగరవేస్తున్న మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, చిత్రంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, పార్టీ నేతలు

నేడు ప్రాంతీయ పర్యాటక పెట్టుబడిదారుల సదస్సు

సాక్షి, విశాఖపట్నం : రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రాంతీయ పర్యాటక పెట్టుబడిదారుల సదస్సు సోమవారం జరగనుంది. పర్యాటక రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారి కె.జ్ఞానవేణి తెలిపారు. బీచ్ రిసార్టులు, అడ్వెంచర్, క్రూయిజ్ టూరిజం, ఎకో టూరిజం, అరకు కాఫీ, 2024–29 పర్యాటక పాలసీ తదితర అంశాలపై చర్చించనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా జిల్లాలో టూరిజం శాఖకు సంబంధించి 15 ల్యాండ్ పాకెట్స్ ఉన్నాయని.. టర్నోవర్‌ను బట్టి ఆసక్తి గల సంస్థలకు భూ కేటాయింపులు జరుగుతాయని.. ఈ అంశంపైనా సదస్సులో చర్చించనున్నామన్నారు. దిగ్గజ కంపెనీల ప్రతినిధులు భాగస్వామ్యం కానున్న ఈ సదస్సును పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించనున్నారని తెలిపారు. సమ్మిట్‌కు ఏపీటీడీసీ చైర్మన్, ఇతర ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్, అధికారులు హాజరుకానున్నారని వెల్లడించారు.

సీఐ అశోక్‌కుమార్‌కు హోమ్ మినిస్టర్ ఎక్స్‌లెన్సీ మెడల్

- ఎస్పీ తుహిన్ సిన్హా చేతుల మీదుగా ప్రదానం

సాక్షి, అనకాపల్లి : అనకాపల్లి రూరల్ సీఐ అశోక్‌కుమార్‌కు కేంద్ర హోంమంత్రి ఎక్స్‌లెన్సీ ఇన్ ఇన్వెస్టిగేషన్–2023 మెడల్‌ను జిల్లా కలెక్టర్ విజయక్రిష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా చేతుల మీదుగా అందజేశారు. అల్లూరి జిల్లా జీకే వీధి సీఐగా ఉన్న అశోక్‌కుమార్‌కు 2022 జూన్ 28న మహారాష్ట్రకు చెందిన గంజాయి స్మగ్లర్ సుభాష్ అన్నా పవర్ చెరలో బందీలుగా ఉన్న జీకే మండలం ఏబులం గ్రామానికి చెందిన ఆరుగురు గిరిజనులను రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి సురక్షితంగా రక్షించి తీసుకొచ్చారు. ఈ రెస్క్యూ ఆపరేషన్‌లో తన టీమ్‌తో కలిసి మహారాష్ట్రలోని ఒస్మానాబాద్ జిల్లా పోలీసులతో సమన్వయం చేసుకొని త్వరితగతిన వారు బంధింపబడిన ప్రదేశాన్ని గుర్తించి సమర్థవంతంగా ఆపరేషన్ చేశారు. అరెస్టు చేసే సమయంలో వారి చుట్టూ ఉండే అన్నా పవర్ మనషులు ఆయుధాలతో ప్రతిఘటించినప్పటికీ, అన్నా పవర్‌ని అరెస్టు చేసి అతని ఆధీనంలో బంధించబడి ఉన్న ఆరుగురు గిరిజనులకు విముక్తి కలిగించారు. వారిని వారి స్వగ్రామం తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అప్పటి అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ప్రతిపాదనతో కేంద్ర ప్రభుత్వం యూనియన్ హోం మినిస్టర్ మెడల్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ ఇన్వెస్టిగేషన్- 2023 మెడల్‌తో సత్కరించింది. ఈ సందర్భంగా సీఐ అశోక్‌కుమార్ మాట్లాడుతూ..తాను గిరిజనులను రక్షించినప్పుడు ఎస్పీగా ఉన్న తుహిన్ సిన్హా చేతుల మీదుగానే ఇప్పుడు మెడల్ తీసుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు.



ఎస్పీచేతుల మీదుగా మెడల్ స్వీకరిస్తున్న సీఐ అశోక్‌కుమార్ చిత్రంలో కలెక్టర్ విజయకృష్ణన్

ప్రతిభకు పట్టాభిషేకం

ఉత్తమ సేవలందించిన అధికారులకు గణతంత్ర వేడుకల సందర్భంగా ఆదివారం కలెక్టర్ విజయ కృష్ణన్ చేతుల మీదుగా ప్రతిభా పురస్కారాలు అందజేశారు. వివిధ విభాగాల్లో ఉత్తమ పనితీరు కనబరిచిన జిల్లా, మండల స్థాయి అధికారులు, కింది స్థాయి అధికారులు, సిబ్బంది పురస్కారాలు అందుకున్నారు.



కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ జాహ్నవి, ఎస్పీ తుహిన్ సిన్హా, ఎమ్మెల్యే బండారు చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకుంటున్న ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, డిప్యూటీ సీఐ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణ, జిల్లా ఫైర్ అధికారి ఆర్.వి.రమణ, పంచాయతీరాజ్ ఈఈ కె.వి.నాయుడు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మనోరమా, కలెక్టర్ కార్యాలయ సూపరింటెండెంట్ రాణి, కలెక్టర్ కార్యాలయం ల్యాండ్ సెక్షన్ సూపరింటెండెంట్ పి.వి.రత్నం, కలెక్టర్ కార్యాలయ కో ఆర్డినేషన్ సూపరింటెండెంట్ ఎస్ఎస్వీఎస్ఏ నాయుడు, కలెక్టరేట్ సిబ్బంది రాజేశ్వరి, సోమేష్ కుమార్, జి.శ్రీనివాస్, పి.రవికుమార్



ప్రశంసా పత్రాలు అందుకుంటున్న కలెక్టరేట్ సిబ్బంది పి.వి.గిరి, అనకాపల్లి తహసీల్దార్ టి.విజయకుమార్, అనకాపల్లి డివిజనల్ అడ్మిషన్ అధికారి బి.సుధాకర్‌రావు, అనకాపల్లి ఆర్డీవో కార్యాలయ డీటీ ఎం.లలిత కుమారి, అనకాపల్లి ఆర్డీవో కార్యాలయ డీఏవోఎస్ ఎం.వెంకన్న, ఆర్డీవో కార్యాలయ అధికారి ఈశ్వరరావు, చోడవరం ఆర్ఎస్‌డీటీ వేణుగోపాల్ రాజు, రాంబిల్లి మండలం ఆర్ఐ రవికుమార్, అచ్యుతాపురం తహసీల్దార్ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ లోవరాజు, పశుసంవర్థక శాఖ అసిస్టెంట్ సర్జన్ రాణి, పశుసంవర్థక శాఖ యలమంచిలి అధికారి వరహాలబాబు, పశుసంవర్థక శాఖ సబ్బవరం ఆర్బీకే ఏహెచ్ అసిస్టెంట్ కె.లక్ష్మణ్, డీఆర్డీఏ డీపీఎంయూ జి.డైజీ, డీఆర్డీఏ జిల్లా పీఎం (హెచ్ఆర్) పి.రమణ, డీఆర్డీఏ అడ్మిన్ డీపీఎంయూ, జె.గణేష్ అనకాపల్లి సీఐ విజయకుమార్, అనకాపల్లి ఎస్ఐ అలీ



అవార్డు స్వీకరిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ(పరిపాలన) ఎం.దేవ ప్రసాద్, అదనపు ఎస్పీ (క్రైం) ఎల్.మోహన్‌రావు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ అప్పారావు, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణమూర్తి, ఎన్డీపీఎస్ సెల్ ఇన్‌స్పెక్టర్ గఫూర్, అచ్యుతాపురం పోలీస్ స్టేషన్ సీఐ ఎన్.గణేష్, నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ, అనకాపల్లి సైబర్ సెల్ సీఐ కల్యాణి, అనకాపల్లి డీఎఆర్, ఆర్ఐ మన్మథరావు, అనకాపల్లి డీఏఆర్, వెల్ఫేర్ ఆర్ఐ, బి.రామకృష్ణ, అనకాపల్లి సీసీఎస్ స్టేషన్ ఎస్ఐ పి.రమేష్



సాంస్కృతిక కార్యక్రమంలో మెమెంటో అందుకున్న తానాం స్కూల్ విద్యార్థులు



సాంస్కృతిక కార్యక్రమంలో బహుమతి అందుకున్న అనకాపల్లి డీఏవీ స్కూల్ విద్యార్థులు



థింసా నృత్యం చేసిన వి.మాడుగుల చిన్నారులతో కలెక్టర్ విజయ కృష్ణన్



శకటాల ప్రదర్శనలో ప్రథమ బహుమతి పొందిన వ్యవసాయ, మత్స్యకార, పశువర్థక శాఖల అధికారులు



ద్వితీయ బహుమతి అందుకున్న గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది



తృతీయ బహుమతి అందుకున్న ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

కలెక్టరేట్‌లో జేసీ పతాకావిష్కరణ



జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి

తుమ్మపాల : 76వ గణతంత్ర వేడుకల్లో భాగంగా కలెక్టరేట్‌లో ఆదివారం నిర్వహించిన వేడుకల్లో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి జాతీయ జెండాను ఎగురవేసి వందనం సమర్పించారు. చిన్నారులకు మిఠాయిలు పంచిపెట్టి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి రాణి, సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్కంఠగా రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

చోడవరం : రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు రెండో రోజు ఆదివారం ఎంతో ఉత్కంఠంగా జరిగాయి. పోటీలను చూసేందుకు వచ్చిన క్రీడాభిమానులతో అంకుపాలెంలో క్రీడా ప్రాంగణం కిక్కిరిసింది. ఈ గ్రామంలో దుర్గాంబిక అమ్మవారి పండగను పురస్కరించుకొని రాష్ట్రస్థాయి మహిళ, జిల్లా స్థాయి పురుషుల కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్, జిల్లా కబడ్డీ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. 13 జిల్లాల నుంచి 913 మహిళా జట్లు పోటీ పడుతున్నాయి. ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వి.వీరలంకయ్య, రిఫరీస్ బోర్డు చైర్మన్ బాలు, జిల్లా కబడ్డీ అసోషియేషన్ కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఈ పోటీలను పర్యవేక్షిస్తున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో చివరి రోజు సోమవారం ఫైనల్ మ్యాచ్‌లు జరుగుతాయి.



తలపడుతున్న మహిళా జట్లు

రెండో రోజు తలపడ్డ మహిళా జట్లు

కర్నూలు జట్టుపై పశ్చిమగోదావరి, చిత్తూరు జట్టుపై నెల్లూరు జట్టు విజయం సాధించాయి. అనంతపురంపై కృష్ణా జిల్లా, కడపపై శ్రీకాకుళం, ప్రకాశంపై తూర్పుగోదావరి జట్టు గెలుపొందాయి. పశ్చిమగోదావరిపై చిత్తూరు, నెల్లూరు జట్టుపై కర్నూలు , చిత్తూరు జట్టుపై కృష్ణా జట్లు గెలుపొందాయి. కడపపై విజయనగరం జట్టు, ప్రకాశంపై శ్రీకాకుళం, కడపపై తూర్పుగోదావరి, అనంతపురంపై కృష్ణా, గుంటూరుపై విజయనగరం జట్లు విజయం సాధించాయి. కర్నూలుపై నెల్లూరు, ప్రకాశంపై చిత్తూరు, గుంటూరుపై విశాఖపట్నం జట్టు గెలుపొందాయి.

13 ఏళ్ల బాలికపై హాకీ క్రీడాకారుడు లైంగికదాడి

- తల్లి ఫిర్యాదుతో పోక్సో కేసు నమోదు

యలమంచిలి రూరల్ : పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన 13 ఏళ్ల బాలికపై సీనియర్ హాకీ క్రీడాకారుడు లైంగికదాడికి పాల్పడ్డాడు. పట్టణంలోని ఉలకోపేటకు చెందిన యువకుడు మళ్ల రూపేష్ హాకీ క్రీడాకారుడు. రాజీవ్ క్రీడా మైదానంలో హాకీ సాధన కోసం వస్తున్న వస్తున్న 13 ఏళ్ల బాలికతో పరిచయాన్ని ఆసరాగా చేసుకుని మాయమాటలు చెప్పి లైంగికదాడికి పాల్పడినట్టు తెలుస్తోంది. ఈ దారుణానికి సంబంధించి బాధిత బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై బీఎన్ఎస్ సెక్షన్ల ప్రకారం పోక్సో కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ కె.సావిత్రి ఆదివారం రాత్రి మీడియాకు తెలిపారు. నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నాడు. పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బేతపూడి కేజీబీవీ విద్యార్థినులకు కలెక్టర్ ప్రశంస

గణతంత్ర వేడుకల్లో ఆకట్టుకున్న యోగాసనాల ప్రదర్శన



బేతపూడి కేజీబీవీ విద్యార్థినులను అభినందిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

దేవరాపల్లి: అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో జిల్లా స్థాయిలో ఆదివారం నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో మండలంలోని కేజీబీవీ విద్యార్థినులు చేసిన యోగాసనాలతో కూడిన నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా అద్భుత ప్రదర్శన చేసిన బేతపూడి కేజీబీవీ విద్యార్థినులను జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ప్రత్యేకంగా అభినందించి, మెమెంటోలను అందజేశారు. ఇటీవల బేతపూడి కేజీబీవీని సందర్శించిన కలెక్టర్ యోగాసనాలలో స్థానిక విద్యార్థినుల ప్రతిభను గుర్తించారు. ఈ క్రమంలోనే జిల్లా స్థాయిలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనే గొప్ప అవకాశాన్ని స్థానిక విద్యార్థినులకు కల్పించారు.

కోడి పందేల శిబిరంపై పోలీసుల దాడి

యలమంచిలి రూరల్ : మండలంలోని షేక్విపాలెం సమీపంలో కోడి పందేల శిబిరంపై ఆదివారం యలమంచిలి రూరల్ పోలీసులు ఆకస్మిక దాడి నిర్వహించారు. ఇక్కడ గ్రామ శివార్లలో కోడి పందాలు నిర్వహిస్తున్న సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు వెళ్లి పరిశీలించగా కోడి పుంజులకు కత్తులు కట్టి, నగదు బెట్టింగ్‌గా ఉంచి పందేలు నిర్వహిస్తున్నట్టు గుర్తించారు. శిబిరం వద్ద నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద రెండు కోడి పుంజులు, రూ.250 నగదు స్వాధీనపర్చుకున్నట్టు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ మరో చిన్నారి మృతి



ఇషిత(ఫైల్)

తగరపువలస: ఇద్దరు బిడ్డలకు విషమిచ్చి తల్లి కూడా విషం తీసుకున్న ఘటనలో.. పెద్ద కుమార్తె ఇషిత(5) నగరంలోని కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు ఆదర్శనగర్‌కు చెందిన దివీస్ ఉద్యోగి మహంతి రామకృష్ణతో మనస్పర్థల కారణంగా తల్లి మాధవి(25) గత శుక్రవారం తాను విషం తీసుకోవడంతో పాటు ఇద్దరు కుమార్తెలు ఇషిత, రితిక్ష(18 నెలలు)లకు విషం ఇచ్చిన సంగతి తెలిసిందే. అదే రోజు సంగివలస ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో మాధవి, శనివారం నగరంలోని కార్పొరేట్ ఆసుపత్రిలో రితిక్ష మృతి చెందారు. ఆదివారం పెద్ద కుమార్తె ఇషిత కూడా మృతి చెందినట్టు భీమిలి సీఐ బి.సుధాకర్ తెలిపారు.

రంగోత్సవంలో మెరిసిన గురుకుల విద్యార్థులు

- ముంబైలో జరిగిన పోటీల్లో 8 మందికి స్వర్ణ పతకాలు
- ఐదుగురు విద్యార్థులకు రజత పతకాలు
- అభినందించిన ప్రిన్సిపాల్ రఘు



తెనుగుపూడి గురుకుల విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పి.రఘు తదితరులు

దేవరాపల్లి : జాతీయ స్థాయి రంగోత్సవ సెలబ్రేషన్స్, చిల్డ్రన్ ఆర్ట్ కాంపిటీషన్‌లో మండలంలోని తెనుగుపూడి డా. బీఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాలయం విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. ఇటీవల ముంబైలో జరిగిన జాతీయ చిల్డ్రన్ ఆర్ట్ కాంపిటీషన్‌లో గురుకులం విద్యార్థులు 8 స్వర్ణపతకాలు, ఐదుగురు రజత పతకాలు సాధించారు. స్థానిక గురుకుల విద్యాలయానికి చెందిన కె.సుధీర్, బి.సంజయ్, ఎం.జయశంకర్, ఎల్.ఆకర్ష్, వి.అఖిల్, ఎ.నవీన్‌కుమార్, పి.చిన్నారావు, పి.జశ్వంత్‌లు గోల్డ్ మెడల్స్ సాధించారు. కె.మదన్, వై.నరేంద్ర, జి.జశ్వంత్, ఎం.రాజేష్, ఎం.తేజ సిల్వర్ మెడల్స్‌ను సాధించారు. జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులను, ప్రోత్సహించిన ఆర్ట్ టీచర్ జి.అర్జునరావును ఆదివారం స్థానిక గురుకుల విద్యాలయంలో ప్రిన్సిపాల్ పి.రఘు, ఉపాధ్యాయులు, మాజీ పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఉల్లి శ్రీను అభినందించారు. ప్రశంసా పత్రాలతో సత్కరించారు.

ముగిసిన గౌతమ పఠన మందిరం స్వర్ణోత్సవాలు

- ఆకట్టుకున్న అన్నదాత నాటిక ప్రదర్శన
- విజేతలకు బహుమతులు, ఆదర్శ రైతులకు సత్కారం




అన్నదాతలోని సన్నివేశాలు




ఆదర్శ రైతు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

మునగపాక: మునగపాకలోని గౌతమపఠన మందిర స్వర్ణోత్సవాలు ఆదివారం రాత్రితో ఘనంగా ముగిసాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాత నాటిక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. కళాంజలి హైదరాబాద్ వారు ప్రదర్శించిన నాటికకు విల్లూరి శివప్రసాద్ రచన అందించగా కొల్లా రాధాకృష్ణ దర్శకత్వం వహించారు. నటీనటులు మెరుగైన ప్రతిభ కనపరిచారు. స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా ఆదర్శ రైతులకు సత్కారం నిర్వహించారు. మూడు రోజులుగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ కళాకారులను, రైతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఏటా గౌతమ పఠన మందిరం అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఎంపీటీసీ సూరిశెట్టి రాము, మాజీ ఎంపీటీసీ సూరిశెట్టి సుధారాణి, మారిశెట్టి అప్పారావు, దాడి సూరిబాబు, దాడి అప్పలనాయుడు, శ్రీరామమూర్తి, దాడి శివ, ఆడారి లక్ష్మణరావు, బూడిద రామారావు, వెలగా శ్రీనివాసరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ముగిసిన గవరపాలెం గౌరీపరమేశ్వరుల ఉత్సవం



అమ్మవారి ఉత్సవంలో యువకుల సందడి



స్టేజ్‌పై డ్యాన్స్ బేబీ డ్యాన్స్

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీపరమేశ్వరుల అమ్మవారి ఉత్సవం శనివారం రాత్రి ఘనంగా ముగిసింది. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సుమారుగా 3 లక్షల మంది ప్రజలు శనివారం సాయంత్రం నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకూ ఉత్సవాన్ని తిలకించారు. గవరపాలెం సంతోషిమాత ఆర్చ్ పక్కన మందుగుండు సీతారామయ్య కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ బాణసంచాను జనసేన నియోజకవర్గ నాయకుడు భీమరశెట్టి రాంకీ వెలిగించారు. ఉత్సవంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ ఎం.శ్రావణి, పట్టణ సీఐ విజయకుమార్, ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణలు పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొణతాల సంతోష్ అప్పారావునాయుడు, కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, కోశాధికారి కొణతాల నూక మహాలక్ష్మీనాయుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'గణతంత్ర స్ఫూర్తితో చట్టాలను రక్షించుకుందాం'



మోదీ పాలనకు వ్యతిరేకంగా నెహ్రూచౌక్‌లో నిరసన తెలియజేస్తున్న సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు, రైతు సంఘాల నాయకులు


అనకాపల్లి: గణతంత్ర దినోత్సవాన్ని స్ఫూర్తితో రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రజలంతా కృషి చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ కర్రి అప్పారావు కోరారు. ప్రధాని మోదీ పాలనకు వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా కేంద్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక నెహ్రూ చౌక్‌లో ఆదివారం నిరసన తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో 65 శాతం ఉన్న రైతులు తాము పండి పంటలకు గిట్టుబాటు ధర లభించక ఆందోళన చెందుతున్నారన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తున్నారని, కార్మిక చట్టాలను సవరించి 4 లేబర్ కోడ్స్‌గా మార్చి పెట్టుబడుదారులకు అనుకూలంగా చేయడం అన్యాయమన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ పేరుతో వల్లిస్తున్న బీజేపీ ప్రభుత్వం, కార్పొరేట్ శక్తులకు రూ.16 లక్షల కోట్ల రుణాలు రద్దు చేసే విధంగా పాలన సాగిస్తుందన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతులకు ఉన్న రూ.4 లక్షల కోట్ల రుణాలు మాఫీ చేయమంటే చేయలేదని ధ్వజమెత్తారు. దేశంలో నిరుద్యోగం భారీగా పెరుగుతోందని, ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేయడం, ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టడం వంటి చర్యలు చురుగ్గా సాగుతున్నాయని ఆరోపించారు. గత నాలుగేళ్లుగా విశాఖ ఉక్కును పరిరక్షించాలని, సొంత గనులు కేటాయించాలని, సెయిల్‌లో విలీనం అమలు చేయాలని ఉద్యమాలు జరుగుతున్నాప్పటికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చీమ కుట్టినట్లు లేకుండా పోయిందన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, జిల్లా రైతు నాయకులు బాలు గాడి, రెడ్డి పల్లి అప్పలరాజు, మోహన్‌రావు, జి.కోటేశ్వరరావు, వి.వి.శ్రీనివాసరావు, రొంగలి రాము, దేముడు నాయుడు, గండి నాయనబాబు పాల్గొన్నారు.

నిరంతరాయంగా విద్యుత్ సరఫరా

సీతమ్మధార: తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఈపీడీసీఎల్) పరిధిలోని 11 సర్కిళ్లలోని సుమారు 76 లక్షల వినియోగదారులకు అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో నిరంతరాయంగా విద్యుత్ సేవలందిస్తున్నట్లు సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. సీతమ్మధారలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో ఆయన జాతీయ జెండా ఆవిష్కరించారు. వ్యవసాయ రంగానికి 9 గంటల త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా చేయడం ద్వారా 3.35లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరుతోందన్నారు. పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకంలో భాగంగా కిలోవాట్‌కు రూ.30 వేలు, 2 కిలోవాట్లకు రూ.60 వేలు, 3 కిలోవాట్లకు రూ.78 వేల చొప్పున రాయితీ అందిస్తున్నామన్నారు. ఇప్పటివరకు సుమారు 4,500 సర్వీసులకు 16 మెగావాట్ల సోలార్ రూఫ్ టాప్ ప్లాంట్ల ఏర్పాటు చేశామన్నారు. అనంతరం 120 మంది ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. డైరెక్టర్లు డి.చంద్రం, వి.విజయలలిత, బి.రామచంద్రప్రసాద్, సంస్థ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కె.వి.రామకృష్ణప్రసాద్, సీజీఎంలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ దీక్షిత మృతి

కావేరి ట్రావెల్స్ యాజమాన్యం, ప్రభుత్వం పట్టించుకోలేదని బంధువుల ఆవేదన



దీక్షిత(ఫైల్)

పెందుర్తి: రాజమండ్రిలో బుధవారం జరిగిన కావేరి ట్రావెల్స్ బస్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఈల్లా దీక్షిత(22) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. సుజాతనగర్‌కు చెందిన దీక్షిత, మర్రిపాలెనికి చెందిన ఆమె బంధువు కల్యాణి ఇంటర్వ్యూ నిమిత్తం విశాఖ నుంచి హైదరాబాద్‌కు కావేరి ట్రావెల్స్ బస్‌లో ఈ నెల 22న బయలుదేరారు. రాజమండ్రి వద్దకు వెళ్లేసరికి బస్ బోల్తా పడడంతో కల్యాణి అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. ఆ ప్రమాదంలో గాయపడిన దీక్షితను నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తీసుకువచ్చారు. నాలుగు రోజుల పాటు మృత్యువుతో పోరాడిన దీక్షిత కన్నుమూయడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో కూరుకుపోయారు. మరోవైపు ప్రమాదం జరిగి నాలుగు రోజులైనా కావేరి ట్రావెల్స్ యాజమాన్యం గానీ, ప్రభుత్వం గానీ కనీసం స్పందించకపోవడం పట్ల బంధువులు తీవ్రంగా ఆక్షేపిస్తున్నారు.

క్లుప్తంగా

ధరలు తగ్గించాలని సంతకాల సేకరణ



ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి వరలక్ష్మి ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

కశింకోట: ఐద్వా ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై ప్రభుత్వానికి నివేదించడానికి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. కశింకోట వీధుల్లో తిరిగి సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించిన ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డి.డి. వరలక్ష్మి మాట్లాడుతూ ఆహార భద్రత చట్టాన్ని అమలు చేయాలన్నారు. కోటా ద్వారా ప్రభుత్వం నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు కందిపప్పు సహా 14 రకాల నిత్యావసర వస్తువులను రేషన్ డిపోల ద్వారా రాయితీపై అందించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ స్మార్టు మీటర్లు అమర్చరాదని, విద్యుత్ చార్జీల పెంపునకు కారణమవుతున్న అక్రమ ఒప్పందాలను రద్దు చేయాలన్నారు. పెట్రోల్, డీజల్, గ్యాస్, నిత్యావసర ధరలు తగ్గించాలన్నారు. అర్హులకు రేషన్‌కార్డు, పింఛన్ మంజూరు చేయాలన్నారు.

వేడుకగా సాయిబాబా తీర్థం



చింతలపాలెంలో తీర్థం సందడి

కశింకోట: మండలంలోని చింతలపాలెం గ్రామం వద్ద సాయిబాబా తీర్థ మహోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సాయిబాబాను ప్రజలు దర్శించి పూజలు చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు ఉత్సాహంగా తీర్థ మహోత్సవానికి హాజరయ్యారు. ఆట వస్తువులు, అలంకరణ వస్తువులు, ఇంటి సామగ్రి, తినుబండారాలు, ఖర్జూరం, కూరగాయల అమ్మకాలు జోరుగా సాగాయి. ఆకాశ చక్రం, రంగుల రాట్నాలపై పిల్లలు, పెద్దలు ఉత్సాహంగా తిరుగాడారు. ఫోం జారుడు బల్లలపై పిల్లలు ఆడుతూ ఊరకలు వేశారు. తీర్థం సందర్భంగా విద్యుద్దీపాలంకరణ ఏర్పాటు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సీఐ అల్లు స్వామినాయుడు, తమ సిబ్బందితో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పర్యవేక్షించారు. సర్పంచ్ కొట్టి రాము, మాజీ సర్పంచ్ కర్రి దుర్గినాయుడు, ఎంపీటీసీ సభ్యుడు షేక్ దర్గా తదితరులు పాల్గొన్నారు.

500 మంది దంపతులతో సహస్ర మోదక హోమం



సహస్ర మోదక హోమంలో పాల్గొన్న భక్తులు

అనకాపల్లి: మానవుని జీవితంలో సమస్యలు వస్తాయని, ఎదురుతిరిగి జీవించినప్పుడు ఆనందంగా ఉంటారని మైసూర్ గణపతి సచ్చిదానంద స్వామీజీ అన్నారు. జీవీఎంసీ విలీన గ్రామమైన సిరసపల్లిలోని చింతామణి గణపతి దత్తక్షేత్రంలో ఆదివారం స్వామీజీ చింతామణి రాగ సాగర, సహస్ర మోదక హోమం, శ్రీచక్రపూజలు నిర్వహించారు. ప్రతి వ్యక్తి భక్తి భావనతో మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలని చెప్పారు. సహస్ర మోదక హోమంలో 500 మంది దంపతులు పాల్గొన్నారు. అంతకుముందు దత్తక్షేత్రంలో జాతీయ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో మైసూర్ దత్త విజయానంద తీర్థ స్వామీజీ, దత్తక్షేత్ర నిర్వాహకులు ఆంజనేయరాజు, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 60 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-6 యూనిట్లు, బీ పాజిటివ్-23 యూనిట్లు, ఓ పాజిటివ్-25 యూనిట్లు, ఏబీ పాజిటివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరులో సంప్రదించవచ్చు.



కశింకోట సెయింట్ జాన్స్ స్కూలులో విద్యార్థుల పిరమిడ్ల ప్రదర్శన



నృత్య ప్రదర్శన నిర్వహిస్తున్న సెయింట్ జాన్స్ విద్యార్థులు



ఉడ్‌పేట హ్యాపీకిడ్స్ స్కూల్‌లో దేశ నేతల వేషధారణలో చిన్నారులు



తాళ్లపాలెం గ్రంథాలయం వద్ద జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న గ్రంథాలయ అధికారి జగన్నాథం

మువ్వన్నెల జెండా రెపరెపలు

వాడవాడలా 76వ గణతంత్ర దినోత్సవం

వాడవాడలా మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో త్రివర్ణ శోభితమైంది. 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా దేశ నేతల వేషధారణలో చిన్నారులు అలరించగా, వివిధ శాఖల్లో ఉత్తమ సేవలకుగాను ప్రభుత్వ అధికారులకు పురస్కారాల అందించి సత్కరించారు.



కశింకోట తహసీల్దార్ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు



ఆర్ఏఆర్ఎస్‌లో క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న ఏడీఆర్ ముకుందరావు

అనకాపల్లి: పట్టణంతోపాటు మండలంలో 76వ గణతంత్ర వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. స్థానిక మెయిన్ రోడ్డులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టులో జిల్లా న్యాయమూర్తి ఎస్.శ్రీవిద్య జాతీయ జెండాను ఎగురవేశారు. ఆమె మాట్లాడుతూ రాజ్యాంగం అమలులోకి వచ్చి దేశకీర్తిని మలుపు తిప్పిన రోజుగా ఈ వేడుకలు నిర్వహించుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు నాగేశ్వరరావు, ధర్మారావు, రమేష్, విజయలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.జె.వి.ఎస్.కుమార్, కార్యదర్శి దుర్గారావు, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో...

స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో ఏడీఆర్ సీహెచ్.ముకుందరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గతేడాది చెరకులో అరుంధతి 2006ఎ 223 రకాలను రూపొందించారన్నారు. పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ యూనిట్ ద్వారా నాలుగు కొత్త పేటెంట్లకు దరఖాస్తు చేశారని చెప్పారు. రైతులకు నాణ్యమైన వరి, జనుము, రాగి విత్తనాలను అందించామన్నారు. అంతకుముందు శాస్త్రవేత్తలకు, విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

➡ సత్యనారాయణపురం కనకదుర్గమ్మవారి ఆలయ కొండపైన ఆలయాధ్యక్షుడు బోయిన రమణాజీ జాతీయ జెండాను ఆవిష్కరించారు. రాజ్యాంగ విలువలను గురించి వివరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు యడ్ల త్రినాథ్, శ్రీనివాసరావు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

➡ స్థానిక ఉడ్‌పేట హ్యాపీ కిడ్స్‌లో 76వ గణతంత్ర వేడుకలను నిర్వహించారు. స్కూల్ కరస్పాండెంట్ శెట్టి గిరీష్ కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 1950 జనవరి 26న భారత తొలి రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ జాతీయ జెండాను ఆవిష్కరించినట్లు చెప్పారు. చిట్టిపొట్టి చిన్నారులంతా గాంధీ, సుభాష్ చంద్రబోస్, ఝాన్సీలక్ష్మీబాయి, రుద్రమాదేవి, భగత్ సింగ్ తదితర వేషాలు వేసి అలరించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

➡ జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు రేబాక మధుబాబు, అంబేడ్కర్ మెమోరీ సొసైటీ అధ్యక్షుడు దూలం బూసిరాజులు స్థానిక నెహ్రూ చౌక్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, గణతంత్ర వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు విల్లూరి శ్రీనివాసరావు, లోవ, చందు, బండి అప్పారావు, సత్యనారాయణ, సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

➡ తుమ్మపాల పీహెచ్‌సీలో జాతీయ జెండాను వైద్యురాలు వాణీజగదీశ్వరి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

➡ గవరపాలెం మహాత్మ జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకుల హైస్కూల్‌ల్లో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. జాతీయ జెండాను స్కూల్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. విద్యార్థులు విన్యాసాలు నిర్వహించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

➡ ఆక్కిరెడ్డిపాలెం పంచాయతీ ఎన్టీఆర్ కాలనీలో జిల్లా పరిషత్ ఉన్నత హైస్కూల్‌లో జాతీయ జెండాను హెచ్‌ఎం ఎం.బాపునాయుడు ఆవిష్కరించారు. అంతకుముందు డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ వరద వెంకట కృష్ణారావు, వార్డు మెంబర్లు పుట్టా భాగ్యలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ కాలనీలో హైస్కూల్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించిన హెచ్‌ఎం బాపునాయుడు



కశింకోట రిటైర్డు ఉద్యోగుల సంఘం కార్యాలయం వద్ద జాతీయ జెండా ఆవిష్కరణ



కశింకోట బాలికల హైస్కూల్లో థింసా నృత్య ప్రదర్శన చేసిన బాలికలను అభినందిస్తున్న హెచ్‌ఎం స్వర్ణకుమారి



కోర్టులో జాతీయ జెండాను ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న జిల్లా న్యాయమూర్తి శ్రీవిద్య



కశింకోట పంచాయతీ కార్యాలయంలో గౌరవ వందనం చేస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు



కశింకోట పోలీసు స్టేషన్‌లో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న సీఐ అల్లు స్వామినాయుడు



సత్యనారాయణపురంలో కనకదుర్గ కొండపైన ఆలయాధ్యక్షుడు రమణాజీ జెండా ఆవిష్కరణ

కశింకోట మండలంలో...

కశింకోట: ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఇతర సంస్థల్లో ఆదివారం గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో వి.వి. రవికుమార్ జాతీయ పతాకాన్ని ఎగుర వేశారు. ఎంపీపీ కలగా లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, ఈవోపీఆర్డీ ఎం. వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందన సమర్పణ చేశారు. అనంతరం విద్యార్థులు జాతీయ గీతాలు, మా తెలుగు తల్లి వంటి పాటలు పాడి అలరించారు. పోలీస్ స్టేషన్‌లో సీఐ అల్లు స్వామినాయుడు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసు సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు. పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి రామచంద్రరావు జెండా ఎగుర వేయగా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, సర్పంచ్ మంత్రి జయరజని, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పెంటకోట శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్ వైజ్‌మెన్, తదితరులు పాల్గొన్నారు. బాలికల హైస్కూలులో హెచ్‌ఎం ఎం.ఎస్. స్వర్ణకుమారి, డీపీఎన్ జెడ్పీ హైస్కూలులో హెచ్‌ఎం ఎం.ఆర్.వి అప్పారావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. విద్యార్థులు వివిధ విన్యాసాలు, బాలికల హైస్కూలులో థింసా నృత్య ప్రదర్శన చేసి ఆహూతులను అలరించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాల నిర్వహణ కమిటీ చైర్మన్లు నక్కా నాగమణి, ఆళ్ల శ్రీను, ఉపాధ్యాయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక సెయింట్ జాన్స్ స్కూలులో జాతీయ పతాకాన్ని స్కూలు డైరెక్టర్ బత్తుల నోబుల్ కుమార్, కరస్పాండెంట్ బత్తుల అనూరాధ ఎగుర వేసి గౌరవ వందనం చేశారు. డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు పిరమిడ్లు, నృత్యాలు ప్రదర్శించి ఆహూతులను అలరించారు. స్థానిక రిటైర్డు ఉద్యోగుల సంక్షేమ సంఘ భవనం వద్ద సంఘం అధ్యక్షుడు పాము సూర్యనారాయణ జెండా ఎగుర వేశారు. కశింకోటలో ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్న హోంగార్డు జనపురెడ్డి నరసింగరావు, అంగన్వాడీ కార్యకర్త సూరా నాగమణిల సేవలను అభినందిస్తూ సత్కారం చేశారు. రిటైర్డు ఎంఈవో నంబా రమణ, సంఘ కార్యదర్శి కానూరి గోపాలరావు, కోశాధికారి కె. కామేశ్వరరావు, రిటైర్డు టీచర్ కె. రామునాయుడు తదితరులు పాల్గొన్నారు. తాళ్లపాలెం గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి కె. జగన్నాథం జెండా ఎగుర వేశారు. పలు స్కూళ్లలో గణతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు.



కశింకోట డీపీఎన్ జెడ్పీ హైస్కూలులో బాలికల నృత్య ప్రదర్శన



నెహ్రూ చౌక్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మధుబాబు, బూసిరాజు



తుమ్మపాల పీహెచ్‌సీలో జెండా ఆవిష్కరిస్తున్న వైద్యురాలు వాణీజగదీశ్వరి



కశింకోట డీపీఎన్ జెడ్పీ హైస్కూలులో బాలికల విన్యాసాల ప్రదర్శన



ఎన్టీఆర్ కాలనీ హైస్కూల్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు



సెయింట్ జాన్స్ స్కూలులో జాతీయ పతాక ఆవిష్కరణ



గవరపాలెం మహాత్మ జ్యోతిబాపూలే స్కూల్‌ల్లో విద్యార్థుల విన్యాసాలు

రౌడీ షీటర్ హత్యాయత్నం

పెందుర్తి: నాయుడుతోటలో ఓ రౌడీషీటర్ శనివారం అర్ధరాత్రి హల్‌చల్ చేశాడు. విచక్షణారహితంగా ఓ వ్యక్తిపై బ్లేడ్‌తో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు రౌడీషీటర్‌ను అరెస్ట్ చేశారు. నాయుడుతోట రవినగర్‌లో ముచ్చు చరణ్‌కుమార్ నివాసం ఉంటున్నాడు. అదే ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ బర్రు ప్రేమ్‌స్వరూప్ అలియాస్ బాబీ శనివారం రాత్రి చరణ్‌పై అకారణంగా భౌతిక దాడికి పాల్పడ్డాడు. పోలీసులు రౌడీషీటర్‌ను అరెస్ట్ చేసినట్లు సీఐ వెల్లడించారు.

ఉత్తమ సేవలకు పురస్కారాలు



ఉత్తమ గ్రంథాలయ అధికారి అవార్డును అందుకుంటున్న తుమ్మపాల గ్రంథాలయ అధికారి శ్రీనివాసరావు



కలెక్టర్ విజయ కృష్ణన్ నుంచి పురస్కారం అందుకుంటున్న టైపిస్టు రామ్‌కుమార్

తుమ్మపాల: గణతంత్ర దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో రిపబ్లిక్ డే వేడుకలలో కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ నుంచి జిల్లా ఉత్తమ గ్రంథాలయ అధికారి అవార్డును కె.శ్రీనివాసరావు అందుకున్నారు. మండలంలో తుమ్మపాల గ్రంథాలయాధికారిగా ఉత్తమ సేవలందించినందుకు గాను అవార్డుకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్.సిహెచ్.వెంకటరావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వి.ఆనందరావు, కార్యదర్శి ఎస్.వి.నరసింహ, ఉపాధ్యక్షుడు పి.దమయంతి అసోసియేట్ అధ్యక్షుడు వి.అజయ్ కుమార్, రాష్ట్ర సంఘం ప్రతినిధులు పి.వి.నూకరాజు ఎల్.వి. రమణ, సహాయ కార్యదర్శి వర్మ అభినందనలు తెలిపారు. అవార్డు రావడంతో బాధ్యత మరింతగా పెరిగిందని, గ్రంథాలయ సేవలకు మరింతగా కృషి చేస్తానని తెలియజేశారు.

కశింకోట: మండల పరిషత్ కార్యాలయంలో పని చేస్తున్న టైపిస్టు పి. రామ్‌కుమార్‌కు గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ పురస్కారం లభించింది. ఆదివారం అనకాపల్లిలో కలెక్టర్ విజయ కృష్ణన్ పురస్కారాన్ని అందజేశారు. ఎంపీడీవో వి.వి. రవికుమార్, సిబ్బంది ఆయనను అభినందించారు.